క్లుప్తంగా

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు: సీఐ

మహబూబాబాద్ రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా చైనా మాంజాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. పట్టణంలోని పలుప్రాంతాల్లో గాలిపటాలు, మాంజాలు విక్రయించే షాపుల్లో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎస్సైలు శివ, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గార్ల: గార్ల డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్రం సబ్జెక్ట్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఈనెల 16వ తేదీ లోపు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు శనివారం వెల్లడించారు. పీజీలో 55శాతం మార్కులు ఉండాలని, అదనపు అర్హతలు పీహెచ్‌డీ, నెట్, స్లెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 17 ఉదయం 10.30 గంటలకు అభ్యర్థులకు స్థానిక డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఝాన్సీరెడ్డి



తొర్రూరు: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి భేటీ అయ్యారు. శనివారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పలు అంశాలపై చర్చించారు.

వేం నరేందర్‌రెడ్డికి ఘన స్వాగతం

నెల్లికుదురు: మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు వద్ద ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవరెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు పవర్ స్ప్రేల పంపిణీ



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని భారత్ వికాస పరిషత్ ఆధ్వర్యంలో లాల్ బహుదూర్‌శాస్త్రి వర్ధంతి, వివేకానంద జయంతి సందర్భంగా జిల్లాలోని 11 గ్రామాల రైతు సంఘాలకు ఉచితంగా పవర్ స్ప్రేలను తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు దాసుగారి సతీష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాగేందర్, డాక్టర్ రవీందర్, ఓబిలిశెట్టి రామకృష్ణ, ప్రకాష్‌లోయా, ఆవుల శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఎల్లయ్యకు ఉత్తమ అవార్డు

నెహ్రూసెంటర్: ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య నేషన్ ప్రీమియర్ ఉత్తమ వార్డును శనివారం అందుకున్నాడు. పోరుపల్లి రవి పౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు అవార్డు అందజేసి సన్మానించారు. పేదల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నందుకు అవార్డు ప్రదానం చేసినట్లు ఎల్లయ్య తెలిపాడు.

కుడారై మహోత్సవం



గార్ల: ధనుర్మాసోత్సవంను పురస్కరించుకొని గార్ల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం కుడారై మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేమిశెట్టి శ్రీనివాస్, పుల్లఖండం రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, వేమిశెట్టి కవిత, అత్తులూరి రమాదేవి పాల్గొన్నారు.

సైబర్ నేరగాడి చేతిలో మోసపోయిన మహిళ

మరిపెడ: సైబర్ నేరగాడి చేతిలో మోసపోయిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని గ్యామతండాకు చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాడి ఆఫర్ నమ్మి పలు దఫాలుగా రూ.1.5లక్షలు బదిలీ చేసింది. మోసపోయానని తెలుసుకున్న సదరు మహిళ మనస్తాపంతో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహిళలను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

బ్లాస్టింగ్‌తో భయాందోళన

- మిరపతోటల్లో పడుతున్న రాళ్లు
- ఇళ్ల గోడలకు పగుళ్లు
- స్పందించని మైనింగ్, రెవెన్యూ అధికారులు



బ్లాస్టింగ్ చేస్తున్న గుట్ట ఇదే..



మిరపతోటలో పడిన రాళ్లను చూపుతున్న రైతులు



బీటలు పడిన గోడను చూపుతున్న గ్రామస్తులు

కురవి: మండలంలోని తిర్మలాపురం గ్రామ శివారులో ప్రభుత్వం లీజుకు ఇచ్చిన గుట్టల్లో సామర్థ్యానికి మించి భారీగా బ్లాస్టింగ్ చేయడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, గుట్ట చుట్టు ఉన్న రైతులు భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం సాక్షిలో 'భారీ పేలుడు శబ్దం' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి విధితమే. దీంతో బ్లాస్టింగ్ జరిగిన ప్రాంతాన్ని విలేకరుల బృందం పరిశీలించింది. తిర్మలాపురం శివారులో ప్రభుత్వ భూమిని వరంగల్‌కు చెందిన ఒక వ్యక్తికి రెండు హెక్టార్లలో లీజుకు ఇచ్చారు. మైనింగ్ అధికారులు సైతం అనుమతులు ఇచ్చారు. లీజుకు తీసుకుని మైనింగ్ అనుమతులు ఉన్నప్పటికీ గుట్ట చుట్టు ఉన్న భూమిని ప్రభుత్వం తిర్మలాపురం గ్రామస్తులకు అసైన్డ్ చేసింది. పేలుళ్ల తర్వాత రాళ్లను లారీల్లో అసైన్డ్ భూముల నుంచి క్రషర్ వద్దకు తీసుకెళ్తున్నారు. అయితే సామర్థ్యానికి మించి భారీగా పేలుళ్ల శబ్దాలు వస్తుండడంతో రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. బండరాళ్లు ఎగిరిపడి గుట్ట పక్కన ఉన్న మిరపతోటలు, జామాయిల్ తోటలు, ఇతర పంట పంటచేలల్లో పడుతున్నాయి. దీంతో రైతులకు ఏ సమయంలో ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. గుట్ట సమీపంలో ఉన్న మోద్గుల గూడెంలోని కొందరి ఇళ్ల గోడలు పేలుళ్లకు బీటలు వచ్చాయి. పేలుళ్లపై మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

లీజుకు తీసుకున్న గుట్ట మొత్తం ఎన్ని ఎకరాలు ఉందో సర్వేయర్‌ను పంపించి విచారణ చేయిస్తాం. గుట్ట సర్వే నంబర్ పెద్దది, మొత్తాన్ని సర్వే చేసి ఎన్ని ఎకరాలు ఉందో సర్వే ద్వారా తెలుస్తుంది. ఎంత మందికి అసైన్డ్ చేశారు, అన్యాక్రాంతమైన భూమి ఎంత ఉందో తేల్చి చర్యలు తీసుకుంటాం

– సునీల్‌రెడ్డి, తహసీల్దార్

మందులు అందక ఇబ్బందులు

- మరిపెడలోని ఆయుర్వేద ఆస్పత్రి దుస్థితి
- ఐదు నెలలుగా వైద్యులు లేరు
- సొంత భవనం కరువు



ఇరుకు గదిలో ఉన్న ఆయుర్వేద ఆస్పత్రి

మరిపెడ: మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆస్పత్రిలో మందులు లేక రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోజు ఆస్పత్రికి వచ్చి తిరిగి వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2008లో (ఎన్ఆర్‌హెచ్ఎం) నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ స్కీం కింద ఆయుర్వేద ఆస్పత్రి మంజూరైంది. అప్పటి నుంచి స్థానిక పీహెచ్‌సీలోనే ఓ మూలన ఉంటూ సిబ్బంది సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత సెప్టెంబర్ నెలలో ఇక్కడ పని చేస్తున్న వైద్యులు బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లారు. నాటి నుంచి నేటి వరకు వైద్యుడిని నియమించకపోవడంతో ఆస్పత్రికి కాంపౌండరే దిక్కయ్యాడు. అయితే రోగులకు నెలనెల ఇచ్చే మందులు అయిదు నెలలుగా రాకపోవడంతో రోగుల రోజు ఆస్పత్రికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. స్థానిక పాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకే గదిలో ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. గది ఇరుకుగా ఉన్నందున శాశ్వత భవనం నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పర్మనెంట్ వైద్యులను నియమించాలని స్థానికులు, రోగులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న



డోర్నకల్: మాట్లాడుతున్న చైర్మన్ వీరన్న

డోర్నకల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కోరారు. తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రతా చర్యలపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వీరన్న మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శీలం శ్రీనివాస్, కళాకారులు బండ్ల వెంకన్న, కొమిరి వెంకన్న, గడ్డం రాజమౌళి, భరత్, అనిల్, శ్రీనివాసరావు, అశ్విని, కవిత, సింధూజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

నెల్లికుదురు: మండల కేంద్రంలో వాహనదారులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, హెల్మెంట్ వాడకంపై శనివారం అవగాహన కల్పించినట్లు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు తెలిపారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

బయ్యారం: గార్ల– బయ్యారం సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలని సీఐ రవికుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. ఎవరైన చైనా మాంజాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. పోలీస్‌శాఖ పనితీరుపై డీజీపీ వినూత్నంగా క్యూఆర్ కోడ్ తీసుకొచ్చిందని కోడ్ ద్వారా తమ శాఖ పనితీరుపై ఉన్నతాధికారులకు తెలియజేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

అక్రమ కేసులు అప్రజాస్వామికం

తొర్రూరు: ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్టు రాజ్‌కుమార్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, నాయకులు సోమేశ్వరరావు, రామిని శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, ఈదురు ఐలయ్య, సుధీర్, కాలునాయక్, ఎన్నమనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



జెండా ఎగురవేస్తున్న అంబటి వీరభద్రంగౌడ్

కురవి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కందికొండ గ్రామం నుంచి కొత్తగా ఏర్పడిన బంజర తండా గ్రామంలో పార్టీ గద్దెను నిర్మించగా బానోత్ బీల్యా నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరభద్రంగౌడ్ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందజేసిందన్నారు. కార్యక్రమంలో డోర్నకల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, నాయకులు శ్రీనివాస్, మోహన్‌రావు, లక్ష్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సైదులు, శ్రీధర్, ముత్తిలింగం, వెంకన్న, నాగన్న, భద్రు, నాగార్జున పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

తొర్రూరు: ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 18ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. తొర్రూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి శనివారం సందడిగా చేశారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి: కాంగ్రెస్ పాలన ఏడాది అయిందని, అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సంక్షేమ పథకాలు అందక పేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు తురక రమేశ్, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మహబూబాబాద్ అర్బన్: టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు



గార్ల: వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సూపర్ బూస్ట్ బాల్ యూత్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జెన్నారెడ్డి వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

మరిపెడ రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని ఎస్సై బొలగాని సతీష్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని గిరిపురం గ్రామ అంబేద్కర్ యువసేనా ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో మండలస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఎస్సై సతీష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బహుమతి దాతలు పీవీఎస్ శాస్త్రి, సోమ మాధవి, పరశురాములు, పట్ల మల్లయ్య, సోమ శ్రీనివాస్, పెద్దబోయిన రంగయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

గార్ల: క్రీడలతో యువకుల్లో దేహదారుఢ్యం పెంపొందుతుందని ఎస్సై రియాజ్‌పాషా అన్నారు. శనివారం మండలంలోని రాజుతండాలో వినయ్ జ్ఞాపకార్థం నిర్వహించే మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో భూక్యా జైపాల్, గుగులోత్ వీరయ్య, హరిరామ్, రాంబాయి, మంజుల, కిషన్ పాల్గొన్నారు. మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామంలో కబడ్డీ పోటీలను నిర్వాహకుడు భూక్యా రామ్‌కుమార్ ప్రారంభించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నర్సింహులపేట: మండలంలోని గోపాతండాలో నవ తెలంగాణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను శనివారం ఎస్సై మాలోతు సురేష్ ప్రారంభించారు.

25క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



పట్టుకున్న బెల్లం చూపిస్తున్న ఎస్సై సురేష్

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడెం శివారు పూసలతండా సమీపంలో శనివారం ఉదయం 25క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. పూసలతండా సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొలేరో వాహనంలో నుంచి 25 బస్తాలను డంపు చేస్తున్నారు. 10బస్తాలను ఇండికా కారులో, మిగతా 15బస్తాలను వాహనంలో మరిపెడకు తీసుకెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. మొత్తం 50బస్తాలు, 25క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు తెలిపారు. దూప్యతండాకు చెందిన బాదావత్ చోక్లాగా గుర్తించి విచారించగా రవి అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి చుట్టు పక్కల తండాల్లో అమ్ముతున్నట్లు పేర్కొన్నాడు. వాహనాలు సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చేనేతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

తొర్రూరు: చేనేత కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని పద్మశాలీ సంఘం జిల్లా కన్వీనర్ వన్నాల సాగర్ అన్నారు. చేనేత అభయహస్తం పథకానికి రూ.168 కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ సంఘం ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు వంగ అమరేందర్, ప్రతినిధులు పెండెం ప్రేమ్‌కుమార్, చందా రాజు, జిగిచర్ల శ్రీనివాస్, బుదారపు చంద్రమౌళి, దాసరి శ్రీనివాస్, తుమ్మ నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విజయవంతం చేయాలి

గూడూరు: జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించే మాదిగల దండోరా సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య మాదిగ అన్నారు. మండలంలోని పొనుగోడులో శనివారం డప్పు కళాకారులతో సమావేశమై మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణపై మాట ఇచ్చారన్నారు. మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు భద్రయ్య, యాకయ్య, నరేష్ పాల్గొన్నారు.

ఒర్వలేక భూకబ్జా ఆరోపణలు

డోర్నకల్: ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్‌పై కొంతమంది ఒర్వలేక భూకబ్జా ఆరోపణలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆంగోత్ వెంకన్న, పట్టణ నాయకులు ఎల్లావుల హరికృష్ణ, బానోత్ సరళా శ్రీరాం వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ.. రాంచంద్రునాయక్ రాజకీయ చరిత్రలో మచ్చలేని నాయకుడుగా గుర్తింపు పొందారని తెలిపారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

డోర్నకల్: స్థానిక జెడ్పీ స్కూల్ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ మార్గంలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ప్రారంభించారు. నాయకుడు మాదా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహా అన్నదానం

తొర్రూరు: మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు వర్ధంతిని పురస్కరించుకుని డీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మల్లేశం ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామసహాయం కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కొత్తగూడ: ఈనెల 23న జరిగే ఉమ్మడి వరంగల్ పరిధి తుడుందెబ్బ మహాసభల కరపత్రాలను సంఘం నాయకులు శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల సాధన కోసం తుడుందెబ్బ నిర్విరామ ఉద్యమాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, రవి, లక్ష్మీనారాయణ, జంపయ్య, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కురవి: మండల కేంద్రానికి చెందిన దళిత నాయకుడు కిన్నెర మల్లయ్యకు సావిత్రిబాయి పూలే ఎక్సలెంట్ జాతీయ అవార్డు అందుకున్నందుకు తెలంగాణ ఉద్యమ కళాకారుడు పేర్ల గణేష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దబోయిన శ్రీశైలం, నిమ్మలగంటి కృష్ణమూర్తి, దడిగల రవి, మిర్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

డోర్నకల్: మండలంలోని జోగ్యాతండాలో యువతి అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్సై వంశీధర్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జోగ్యాతండాకు చెందిన బానోత్ జయంతి(20) ఈనెల 6న మధ్యాహ్నం మిరపతోట నుంచి ఇంటికి వచ్చిన తరువాత బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ దొరకలేదు. తల్లి బానోత్ విజయ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టౌన్ ప్లానింగ్ ఉద్యోగానికి అర్హత

కురవి: టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ పరీక్ష(టీపీబీఓ) ఫలితాలు బుధవారం వెలువడగా టీపీబీఓ ఉద్యోగానికి అర్హత సాధించి ఉద్యోగంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు కల్యాణ్ శనివారం తెలిపాడు. మండలంలోని నల్లెల్ల గ్రామ పరిధిలోని సూరతండాలో అజ్మీరా వీరన్న–భారతి దంపతుల చిన్న కుమారుడు పేదింటి బిడ్డ అజ్మీరా కళ్యాణ్ టౌన్‌ప్లానింగ్ పరీక్ష ఉత్తీర్ణత సాధించి ఉద్యోగానికి అర్హత సాధించాడు.

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం

దంతాలపల్లి: కుష్టు వ్యాధి లేకుండా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేస్తున్నాయని వైద్యాధికారి కవిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రజావైద్యశాలలో మొద్దు బారిన మచ్చలు ఉన్న వారిని పరీక్షించారు. కార్యక్రమంలో డీపీఎంఓ వనకర్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

మరిపెడ రూరల్: మండలంలోని గిరిపురం గ్రామానికి చెందిన ఫుట్‌బాల్ విజేత పట్ల మహాను ఎస్సై బొలగాని సతీష్ శనివారం శాలువాతో ఘనంగా సత్కరించారు. అక్టోబర్ నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చింది. కార్యక్రమంలో పీవీఎస్ శాస్త్రి, పట్ల మల్లయ్య, వంశీ, రంగయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కేసముద్రం: మండలంలోని బేరువాడ గ్రామంలో ఏకలవ్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ధన్నసరి సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ శనివారం ప్రారంభించారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

నెల్లికుదురు: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలో సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో డప్పు కళాకారులతో అవగాహన సమావేశం నిర్వహించారు.

ధాన్యం బస్తాల చోరీ

నెల్లికుదురు: గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యం బస్తాలు ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ జిలాని తన వ్యవసాయ భూమిలో సాగు చేసిన 70బస్తాలు(35క్వింటాళ్లు) సుమారు రూ.70వేల విలువ చేసే వరి ధాన్యం బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శనివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి



తొర్రూరు: పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఈనెల 19న మహబూబాబాద్‌లో నిర్వహించే ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 2వ మహాసభల పోస్టర్లను శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆవిష్కరించారు. రవి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు మేరకు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఏర్పుల మహేందర్, నాయకులు మంగళపల్లి ప్రసాద్, అర్వపల్లి వెంకన్న, రామస్వామి, కుమార్, భిక్షపతి పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు



రామన్ శ్లోక ప్లే స్కూల్‌లో వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ శ్లోక కిడ్జి ప్లే స్కూల్‌లో సంక్రాంతి సంబురాలు శనివారం నిర్వహించారు. మహర్షి విద్యాలయంలో రంగురంగుల ముగ్గులతో అలరించారు. వికాస డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.